













ఏరువాక జోరు..

వర్షాలు పడుతుండడంతో అన్నదాతలు పొలం బాటపట్టారు. చేలలో ట్రాక్టర్, నాగళ్లతో దుక్కిదున్నుతున్నారు. కంది మండలం కాశీపూర్‌లో ఓ రైతు పొలంలో పత్తి విత్తనాలు నాటుతూ కనిపించారు. రైతు కుటుంబీకులూ కూలీలతో కలిసి విత్తనాలు నాటారు.

-ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

పెద్దలు పెళ్లికి అంగీకరించడం లేదని..

మంజీరాలో దూకి బావామరదళ్ల ఆత్మహత్య

మనూరు, జూన్ 6: పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో బావమరదళ్లు మంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండలం పూల్‌కుర్తి వద్ద చోటుచేసుకున్నది. ఎస్‌ఐ అబ్బ్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం నారాయణఖేడ్ మండలం చాప్టా.కె గ్రామానికి చెందిన ఉమా అలియాస్ బసమ్మ (21), న్యాల్‌కల్ మండలం కాకిజన్‌వాడేకు చెందిన సదానందం కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరు స్వయాన బావ, మరదళ్లు. వారు తమ ప్రేమ విషయం ఇంట్లో చెప్పినప్పటికీ, ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. దీంతో రెండు రోజుల క్రితం సదానందం, ఉమ ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. సదానందం కుటుంబ సభ్యులు న్యాల్‌కల్ మండలం హద్నూర్ పీఎస్‌లో కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఉమ కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు నారాయణఖేడ్ పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అయితే, మనూరు మండలం పూల్‌కుర్తి వద్ద వంతెనపై బైక్, చెప్పులు ఉండడంతో పోలీసులు అనుమానంతో మంజీరా నదిలో గాలించగా గురువారం సాయంత్రం ఇద్దరి శవాలు తేలాయి. మృతదేహాలను నదిలో నుంచి బయటకు తీయించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



ఉమ (ఫైల్)




సదానందం (ఫైల్)

హమ్మయ్య..

బతికిపోయాం..!

- విచారంలో ఇద్దరు.. విలాసంగా ముగ్గురు
- అంతర్మథనంలో అభ్యర్థులు
- టికెట్ దక్కనిదే మేలనుకుంటున్న ఆశావహులు
- ఆసక్తికరంగా బీఆర్ఎస్ రాజకీయం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 6 : ఎందుకు పోటీ చేశామా అని ఆ ఇద్దరు అనుకుంటుంటే.. టికెట్ దక్కనిదే నయమైందని మరో ముగ్గురు సంతోష పడుతున్నారు.. ఇదీ బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన ఎంపీ అభ్యర్థులు, టికెట్ కోసం యత్నించిన ఆశావహుల పరిస్థితి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో ఓడిన అభ్యర్థులు విచారంలో మునగగా.. టికెట్ ఆశించి భంగపడిన ఆ ముగ్గురు సంతోషపడుతున్నారు. రాష్ట్ర అవతరణ అనంతరం పదేళ్ల అధికారం సాగించిన బీఆర్ఎస్ శ్రేణులకు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మింగుడుపడడం లేదు.




మూడు నెలల ముందు నుంచే టికెట్ల లొల్లి

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు రావడానికి మూడు నెలల ముందు నుంచే బీఆర్ఎస్‌లో టికెట్ల లొల్లి మొదలైంది. మెదక్ పార్లమెంట్ స్థానం టికెట్ రేసులో ఎమ్మెల్సీ పి.వెంకట్రామారెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపించాయి. అయితే, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డికి ఇంకా నాలుగు సంవత్సరాల పదవీకాలం ఉండడంతో ఎంపీగా పోటీ చేయవద్దని కుటుంబ సభ్యులు వారించారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్, బీజేపీలో కీలక నేతలతోనూ సత్సంబంధాలు ఉండడం కూడా ఇందుకు ఒక కారణం. అంతేకాకుండా పార్లమెంట్ ఎన్నికల్లో రూ. 100 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందనే ప్రచారం నేపథ్యంలో గెలిచినా.. ఐదేళ్ల పదవీకాలంలో తిరిగి అంత సంపాదించగలమా అని ప్రశ్నించినట్టు తెలిసింది. అందుకే వెంకట్రామారెడ్డి తొలుత పోటీకి నిరాకరించినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. దీంతో, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మెదక్ ఎంపీగా పోటీచేయడానికి వంటేరు ప్రతాప్‌రెడ్డికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. అధినేత సూచనమేరకు వంటేరు అంతర్గతంగా ప్రచారం కూడా ప్రారంభించారు. తీరా టికెట్ ప్రకటించే సమయానికి ఎన్నికల ఖర్చు కోసం రూ. 100 కోట్లు పెట్టగలవా అని అధినేత ప్రశ్నించగా ఆయన వెనక్కి తగ్గినట్టు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కేసీఆర్, హరీశ్‌రావు స్వయంగా రంగంలోకిదిగి ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డిపై ఒత్తిడిచేసి పోటీకి సిద్ధం చేయించారు. కేసీఆర్‌తో ఉన్న సంబంధాలు, ఎలాగైనా గెలిచే సీటు అనే నమ్మకంతో ఆయన పోటీకి దిగి భారీగా ఖర్చు చేశారు. అయినా, చివరికి ఓడిపోవడమే కాకుండా మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి రావడంతో వెంకట్రామారెడ్డి తీవ్ర ఆవేదనకు గురైనట్టు తెలిసింది. మరోవైపు పోటీ చేయలేకపోయిన వంటేరు ప్రతాప్‌రెడ్డి మాత్రం టికెట్ రాకపోవడమే మంచిదైందని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్టు తెలిసింది.

అనుకోకుండా జహీరాబాద్‌లో పోటీ

జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన పటాన్‌చెరుకు చెందిన నాయకుడు గాలి అనిల్‌కుమార్ పరిస్థితి మరో విషాదం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో చేరిన ఆయన మెదక్ లోక్‌సభ సీటు కోసం ప్రయత్నించారు. తనకు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో పరిచయాలున్నాయని, అక్కడ టికెట్ ఇస్తే పోటీ చేస్తానని అనిల్‌కుమార్ ప్రతిపాదించారు. కానీ, పార్టీ నాయకత్వం ఆయనకు జహీరాబాద్ టికెట్ ఇచ్చింది. పార్టీ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఒత్తిడి చేయడంతో పోటీకి సిద్ధపడి ప్రచారమైతే చేశారు. ఆయన కూడా భారీగానే ఖర్చు చేశారు. కానీ పోలింగ్ తేదీ దగ్గర సమీపించేసరికి గెలుపుపై ఆశలు లేవని గుర్తించి చేతులెత్తేశారు. దీంతో, బీఆర్ఎస్ శ్రేణులు ఈ నియోజకవర్గంలో బీజేపీకి అనుకూలంగా పనిచేశారని ప్రచారం జరిగింది. అనుకున్నట్టే ఫలితాలు వెలువడిన అనంతరం బీఆర్ఎస్ ఇక్కడ కూడా మూడో స్థానానికి పరిమితమైంది. జహీరాబాద్ ఎంపీ టికెట్ కోసం డీఎంఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతి ప్రయత్నించారు. భిక్షపతి ఒక అడుగు ముందుకేసి తనకు టికెట్ ఇస్తే ఖర్చు పెట్టే మొత్తంపై పార్టీ నాయకత్వం ఎదుట ప్రతిపాదనలు కూడా ఉంచినట్టు తెలిసింది. అయినా పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో వీరిద్దరు ఇప్పుడు సంతోషంలో ఉన్నారు. వద్దనుకున్నా తప్పనిసరై పోటీచేసి రూ. కోట్లు ఖర్చు చేసిన గాలి అనిల్‌కుమార్ ఆవేదనలో పడినట్టు చెప్పుకుంటున్నారు.



వెంకట్రామారెడ్డి
అనిల్‌కుమార్
శివకుమార్
ప్రతాప్‌రెడ్డి
భిక్షపతి

పిడుగుపాటుకు నలుగురి మృతి

మెదక్ జిల్లాలో ముగ్గురు.. సంగారెడ్డి జిల్లాలో ఒకరు



సిద్దయ్య (ఫైల్)



నందు (ఫైల్)



గేమ్యానాయక్ (ఫైల్)



గోపాల్ (ఫైల్)

హవేళీఘణపూర్/కౌడిపల్లి/కోహీర్, జూన్ 6: పిడుగుపాటుకు మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో నలుగురు మృతిచెందారు. మెదక్ జిల్లా హవేళీఘణపూర్ మండలం శమ్నాపూర్ శివారులో ఇద్దరు మృతిచెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శమ్నాపూర్ గ్రామానికి చెందిన శెట్టిబోయిన సిద్దయ్య (48) రైతు. ఓరంగంటి నందు (23) వ్యవసాయ కూలీ. సిద్దయ్యకు చెందిన పూరిగుడిసె కప్పేందుకు పొరకను తీసుకువచ్చేందుకు ఇద్దరు కలిసి గ్రామ శివారులోని అడవికి వెళ్లారు. రాత్రయినా తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వెతికారు. అర్ధరాత్రి తరువాత వారు అడవిలోని చెట్టుకింద వారి మృతదేహాలు గుర్తించారు. బుధవారం సాయంత్రం కురిసిన వానకు చెట్టు కింద నిలబడటంతో పిడుగుడి మృతి చెందినట్టు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాలను పోస్టుమార్టు నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు.

గొర్రెల కాపరి..

గొర్రెలు, పశువులను మేపుతున్న వ్యక్తిపై పిడుగు పడడంతో ఒకరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పీర్లా తండాలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ధలవత్ గేమ్యా నాయక్ (53) గురువారం మధ్యాహ్నం గొర్రెలు, పశువులను మేతకు తీసుకువెళ్లారు. ఇంటికి వచ్చేక్రమంలో తండా సమీపంలోని బురుజుగడ్డ సమీపంలోనికి రాగానే పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధి కోసం వచ్చి..

పిడుగు పాటుకు సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పిచేర్యాగడి గ్రామంలో ఒకరు మృతిచెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రంకుంచారం మండలం శివరాంపూర్ గ్రామానికి చెందిన గోపాల్ (38) ఉపాధి కోసం భార్య, కూతురితో పిచేర్యాగడికి వచ్చి ఓ రైతు వద్ద పనికి కుదిరాడు. గురువారం సాయంత్రం పొలం వద్ద పనిచేస్తుండగా వర్షం రావడంతో చెట్టు కింద నిల్చున్నాడు. ఇంతలోనే పెద్ద శబ్దంతో గోపాల్ తలపై పిడుగు పడడంతో అతని అక్కడికక్కడే మృతి చెందాడు.

జోరు వాన..

ఇళ్లలోకి వరద నీరు

తూప్రాన్/జహీరాబాద్ జూన్ 6: తూప్రాన్ మండలంలో గురువారం సాయంత్రం జోరు వాన కురిసింది. మండలంలోని మల్కాపూర్‌లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. వృద్ధులను, పిల్లలను మంచాలపై కూర్చోబెట్టి నీటిని బయటకు ఎత్తిపోశారు. గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కోసం మురుగు కాలువలను తొలగించడంతో వరద ముంచెత్తింది. అలాగే, జహీరాబాద్ డివిజన్ లోనూ మోస్తరు వర్షం కురిసింది. వానాకాలం ముందే రావడంతో రైతులు పొలం పనులు ప్రారంభించారు.



ఇంట్లోకి వర్షపు నీరు చేరడంతో మంచంపై కూర్చున్న చిన్నారులు వృద్ధుడు



ఇంట్లో చేరిన వర్షపు నీటిని బయటకు తోడేస్తున్న మహిళ



సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లో కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలను దింపుతున్న కూలీలు (ఫైల్)

209 కొనుగోలు కేంద్రాలు

మూసివేత

- రెండు కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్లు
- 24,660 మంది రైతులకు రూ.281కోట్ల చెల్లింపులు

సంగారెడ్డి టౌన్, జూన్ 6 : సంగారెడ్డి జిల్లాలో 209 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు. మూడు నెలలుగా కొనసాగిన ధాన్యం సేకరణ దాదాపుగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి 211 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అయితే 209 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ముగియడంతో మూసివేశారు. మిగిలిన రెండు రెండు కొనుగోలు కేంద్రాల్లో ఇంకా ధాన్యం సేకరణ కొనసాగుతున్నది. రాబోయే మూడు, నాలుగు రోజుల్లో వాటిని కూడా మూసివేయనున్నట్లు సివిల్ సప్లై శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్, కేరూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

1,13,814 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

సంగారెడ్డి జిల్లాలో 1,88,960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఏప్రిల్‌లో 17వేల మెట్రిక్ టన్నులు, మేలో 1,46,690 మెట్రిక్ టన్నులు, జూన్‌లో 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు 27,291 మంది రైతుల నుంచి 1,34,814 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో రూ.295 కోట్ల విలువ చేసే 1,33,947 మెట్రిక్ టన్నుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇప్పటి వరకు 1,27,612 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 24,660 మంది రైతుల ఖాతాల్లో రూ.281కోట్లు జమ చేసినట్లు సివిల్ సప్లై అధికార వర్గాలు తెలిపాయి. ఇంకా 2,631మందికి రూ.10కోట్లు బకాయి ఉన్నది.

గ్రూప్-1 పరీక్షకు

పకడ్బందీ ఏర్పాట్లు

మెదక్ అర్బన్, జూన్ 6: జిల్లావ్యాప్తంగా ఈ నెల 9న జరిగే గ్రూప్-1 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లకు బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎరీక్షకు హాజరై అభ్యర్థుల గుర్తింపు కోసం బయోమెట్రిక్ పద్ధతిలో వేలిముద్రలు తీసుకుంటామన్నారు. గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను లోపలికి అనుమతిస్తామన్నారు. గోరింటాకు, మెహందీ వంటివి పెట్టుకోరాదని సూచించారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని, సెల్‌ఫోన్లు, చేతి గడియారాలు, తీసుకురాకూడదన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటున్న మోసగాళ్లను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అములో ఉంటుందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే రీజినల్ కోఆర్డినేటర్ హుస్సేన్, నోడల్ ఆఫీసర్ ఏఎస్పీ మహేందర్ దృష్టి తీసుకొచ్చి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, డీసీఆర్‌బీ సీఐ రవీందర్, ఎస్‌బీసీఐ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

బోరు పైపులు ధ్వంసం..

కుప్పకూలి రాయిమీద పడి రైతు మృతి

- పైపులు ధ్వంసం చేసిన వ్యక్తి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన
- పోలీసుల జోక్యం.. కుటుంబ సభ్యుడి ఫిర్యాదుతో కేసు నమోదు

మద్దూరు, జూన్ 6 : పక్క భూమి రైతు బోరు పైపులను ధ్వంసం చేయగా, ఆ బోరు వద్దే రాయిమీద పడి ఓ అన్నదాత మృతిచెందాడు. న్యాయం చేయాలని ఆ రైతు ఇంటి ఎదుట మృతదేహంతో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన మద్దూరు మండలం మర్మాముల గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సుందరగిరి రాములు, ఉప్పల పెద్దకిష్టయ్యకు పక్కపక్కనే పొలాలు ఉన్నాయి. ఐదారేళ్ల క్రితం భూముల కొలతలు చూసుకున్నారు. పెద్దకిష్టయ్య బోరు సుందరగిరి రాములు భూమిలోకి వచ్చింది. గ్రామ పెద్దల సమక్షంలో జరిగిన పంచాయతీలో 30 ఏళ్ల క్రితం వేసుకున్న బోరును ముట్టుకోవద్దని చెప్పి రాములుకు ఏడు గుంటల భూమిని పెద్దకిష్టయ్య నుంచి ఇప్పించారు. ఇటీవల ఉప్పల పెద్దకిష్టయ్య రూ.3 లక్షల దాకా అప్పు చేసి ఉన్న కొద్దిపాటి భూమికి నీళ్లు సరిపోనందున కొత్తగా మూడు బోర్లు వేయించగా చుక్కనీరు పడ లేదు. ఈ క్రమంలో సుందరగిరి రాములు బోరు తన దేనని, ఏడు గుంటల భూమి తనకు అక్కరలేదని పెద్దకిష్టయ్యకు చెప్పాడు. బుధవారం రోజున పెద్దకిష్టయ్యకు చెందిన బోరు పైపులైన్, మోటారు స్టాటర్‌ను రాములు ధ్వంసం చేయడంతో పొలానికి నీళ్లు బందయ్యాయి. బోరు వద్దకు వెళ్లిన పెద్ద కిష్టయ్య అక్కడి పరిస్థితిని చూసి కుప్పకూలి రాళ్ల మీద పడి అక్కడిక్కడే మృతిచెందాడు. దీంతో న్యాయం కోసం కుటుంబ సభ్యులు ఉప్పల కిష్టయ్య శవాన్ని సుందరగిరి రాములు ఇంటి ఎదుట వేసి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ, ఏఎస్‌ఐ జగదీశ్వర్, సిబ్బందితో కలిసి మర్మాముల గ్రామానికి చేరుకున్నారు. జరిగిన సంఘటనపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేర్యాల మార్చురీకి తరలించారు. అయితే పోలీసుల కథనం మరోలా ఉన్నది. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం బోరు వద్ద బోల్టులు విప్పి ఉండటంతో కిష్టయ్యకు తన అల్లుడు సమాచారం అందించాడు. మధ్యాహ్నం కిష్టయ్య బోల్టులు బిగించే సమయంలో ప్రమాదవశాత్తు వెనుకకు పడిపోగా తలకు రాయి తగలడంతో రక్తస్రావం జరిగి చనిపోయాడు. కిష్టయ్య అల్లుడు గుడ్ల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కిష్టయ్యకు భార్య పుష్ప, దివ్యాంగురాలైన కూతురు ఉన్నారు.

పోతారం(ఎస్)లో

ముగిసిన వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం

- క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

హుస్నాబాద్‌రూరల్, జూన్ 6 : హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో నిర్వహించిన వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం ముగిసినట్లు కబడ్డీ క్రీడాకారుడు, హోంగార్డు మడక కృష్ణ తెలిపారు. నెల రోజులుగా కబడ్డీ శిక్షణ పొందిన క్రీడాకారులకు ఆర్మీలో పనిచేస్తున్న సాయికృష్ణ పంపించిన క్రీడా దుస్తులను హుస్నాబాద్ క్రీడల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కేడం లింగమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా కేడం లింగమూర్తి మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని, రాబోయే రోజుల్లో ఇలాంటి క్యాంపులను మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. పోతారం(ఎస్)లో హోంగార్డు కృష్ణ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి క్రీడాకారులకు కబడ్డీ శిక్షణ ఇవ్వడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు వెన్న రాజు, మండల నాయకులు బంక చందు, బాలయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో

ఈ సెట్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

నంగునూరు, జూన్ 6 : నంగునూరు మండలం రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 8 నుంచి నిర్వహించనున్న ఈ సెట్ కౌన్సెలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులను పూర్తిచేసి, నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలోకి ప్రవేశం కోసం ఈ సెట్ రాసి ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు.

కౌన్సెలింగ్ జరిగే విధానం..

ఈ సెట్‌లో ర్యాంకు సాధించిన అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 11 వరకు వెబ్‌సైట్‌లో స్లాట్‌ను నమోదు చేసుకోవాలి. స్లాట్ ప్రకారంగా విద్యార్థులకు 10 నుంచి 12వ తేదీ వరకు రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాలను పరిశీలిస్తారు. అభ్యర్థులు ఈ నెల 10 నుంచి 14 వరకు ఆన్‌లైన్‌లో వెబ్‌ఆప్షన్ ద్వారా కాలేజీలను ఎంపిక చేసుకోవాలి. 18లోపు వెబ్‌ఆప్షన్లు పెట్టుకున్న అభ్యర్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుంది. సీట్లు పొందిన అభ్యర్థులు 18 నుంచి 21 వరకు కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట ర్యాంక్ కార్డు, డిప్లొమా మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్స్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలి.

12, 14 తేదీల్లో త్రిబుల్ ఆర్ భూముల రైతులతో సమావేశం : నర్సాపూర్ ఆర్డీవో

నర్సాపూర్, జూన్ 6: త్రిబుల్‌ఆర్ రోడ్డు కోసం భూములు సేకరించనున్న రైతులతో ఈ నెల 12, 14వ తేదీల్లో నర్సాపూర్‌లో సమావేశం నిర్వహించి వారికిచ్చే పరిహారంపై చర్చించనున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లో పలు గ్రామాలకు చెందిన రైతుల భూములను ఇప్పటికే త్రిబుల్‌ఆర్ రోడ్డు కోసం సర్వే చేసి గుర్తించినట్లు చెప్పారు. సర్వే చేసిన భూములకు సంబంధించి 12వ తేదీన శివ్వంపేట మండల పరిధిలోని పోతులబోగుడ, కొత్తపేట, పాంబండ, లింగోజిగూడ, గుండ్లపల్లి గ్రామాలకు చెందిన రైతులతో నర్సాపూర్‌లోని రైతువేదికలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న నర్సాపూర్ మండల పరిధిలోని నాగులపల్లి, తుజాల్‌పూర్, తిర్మలాపూర్, పెద్దచింతకుంట, ఖాజీపేట, మూసపేట, తిర్మలాపూర్ గ్రామాల రైతులతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే గుర్తించిన ఆయా గ్రామాల రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాపాసుపుస్తకం, పాన్‌కార్డు తదితర పత్రాలతో సమావేశాలకు హాజరుకావాలని ఆర్డీవో కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన షెట్కార్ కుటుంబసభ్యులు

నారాయణఖేడ్, జూన్ 6 : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికైన సురేష్‌కుమార్ షెట్కార్ గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని తమ కుటుంబసభ్యులతో కలిశారు. వారు రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన కుమార్తె టీపీసీసీ స్పోక్స్‌పర్సన్ గిరిజాషెట్కార్, కుమారుడు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, ఆయన సతీమణి స్నేహాషెట్కార్, సోదరులు నగేష్ షెట్కార్, జితేందర్‌నాథ్ షెట్కార్, సోదరుడి కుమారుడు సాగర్ షెట్కార్, మాజీ జడ్పీటీసీ సంగీత షెట్కార్, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, శివానీషెట్కార్, తన్వీషెట్కార్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న షెట్కార్ కుటుంబసభ్యులు

ఎల్లవేళలా అందుబాటులో ఉంటా..

- ఆదరించిన ప్రజలకు, నాయకులకు కృతజ్ఞతలు
- మాజీ ఎంపీ బీబీ పాటిల్


మాట్లాడుతున్న బీబీ పాటిల్

జహీరాబాద్, జూన్ 6 : పార్లమెంట్ ఎన్నికల్లో తాను ఓటమి చెందడం బాధాకరమైనప్పటికీ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తానని జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి, తాజా మాజీ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని ఇంద్రప్రస్థాన్‌లో నిర్వహించిన జహీరాబాద్ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి రావడం సంతోషకరమన్నారు. తనను జహీరాబాద్ పార్లమెంట్ ప్రజలు తనను గెలుపు అంచుల వరకు తీసుకెళ్లారని, తనకు ఓట్లు వేసి ఆదరించిన ప్రజలకు, క్షేత్రస్థాయిలో బీజేపీ కోసం అహర్నిశలు పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గడిచిన పదేళ్లలో జహీరాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి ఎంతో కృషి చేశా నని, అదే తరహాలో అందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి అధికార పగ్గాలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు బీజేపీ అభిమానులు నిరుత్సాహానికి గురికావద్దని, ఎక్కడ సమస్య ఉంటే అక్కడ వాలిపోతామన్నారు. బీజేపీ పెద్దల సహకారంతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, విజేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తదితరులు మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభావంతో పాటు కార్యకర్తల కృషి తోడు కావడంతో బీజేపీకి గత ఎన్నికల కంటే ఓటుబ్యాంకు భారీగా పెరిగిందన్నారు. ఎవరు నిరుత్సాహానికి గురికాకుండా సంఘటితంగా పనిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్, బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఉమాకాంత్‌పాటిల్, సుధీర్ బండారి, విశ్వనాథ్, వైద్యనాథ్, శ్రీనివాస్‌గుప్త, దేశెట్టిపాటిల్, ఉమాకాంత్‌పాటిల్, ఢిల్లీ వసంత్, సంతోష్, నరేష్‌పాటిల్, సోమఅనిల్, సుభాష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, భూమయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దత్తగిరి ఆశ్రమంలో మంత్రి దామోదర్ ప్రత్యేక పూజలు

ఝరాసంగం, జూన్ 6 : శనేశ్వరుని జయంతి, అమావాస్య సందర్భంగా మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ అర్చకులు వేదమంత్రోచ్ఛారణలు, మంగళావాయిద్యాల మధ్య మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శనేశ్వరుడికి తైలం, నల్లవస్త్రాలు, నువ్వులతో పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆశ్రమంలోని నవగ్రహాలకు, పంచవృక్షాలకు అభిషేకం చేశారు. ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖమణి అవదూత గిరిమహరాజ్ మంత్రిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలను అందజేశారు. మాజీ మంత్రి జె.గీతారెడ్డి ప్రత్యేక పూజలు చేయగా, అవదూత గిరి మహరాజ్ ఆమెను ఆశీర్వదించారు. ఆశ్రమ బావి పీఠాధిపతి సిద్ధయ్య స్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంతురావు పాటిల్, కాంగ్రెస్ నాయకులు తన్వీర్, ఉదయ్ శంకర్ పాటిల్, శంకర్ పాటిల్, నరేష్ కుమార్, ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కేతకీలో అమావాస్య పూజలు

దక్షిణా కాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.


దత్తగిరి ఆశ్రమంలోని శనేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

మెజారిటీ ప్రజాప్రతినిధులు ఉన్నా.. మూడో స్థానమా?

- హుస్నాబాద్ సెగ్మెంట్‌పై బీఆర్ఎస్ పార్టీలో అంతర్మథనం

హుస్నాబాద్, జూన్ 6 : కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుస్నాబాద్ సెగ్మెంట్‌లో ఓట్ల వేటలో చతికిలపడడంతో బీఆర్ఎస్ పార్టీలో అంతర్మథనం మొదలైంది. నియోజకవర్గంలో మెజార్టీ ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌కు చెందిన వారైనప్పటికీ ఓట్లు తగ్గడాన్ని ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో మొదటిస్థానంలో ఉండి ఈసారి మూడో స్థానానికి పరిమితం కావడంలో అంతర్యమేమిటని మథనపడుతున్నారు. హుస్నాబాద్ సెగ్మెంట్‌లో అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్, చిగురుమామిడి, భీమదేవరపల్లి, సైదాపూర్, ఎల్కతుర్తి మండలాలున్నాయి. ఈ ఏడు మండలాల్లో చిగురుమామిడి, సైదాపూర్ కరీంనగర్ జిల్లాలో, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ సిద్దిపేట జిల్లాలో, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి హన్మకొండ జిల్లాలో ఉన్నాయి. ఏడుగురు ఎంపీపీలు, ఆరుగురు జడ్పీటీసీల్లో ఒకరు జడ్పీ చైర్మన్, ఇద్దరు జడ్పీ వైస్ చైర్మన్లు, ఎంపీటీసీలతో పాటు హుస్నాబాద్ మున్సిపాలిటీలోనూ మెజార్టీ ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ వారే. ఇంతమంది ఉండి, గ్రామస్థాయిలోనూ చెక్కుచెదరని కార్యకర్తల బలం ఉన్నప్పటికీ బీజేపీ కంటే తక్కువ ఓట్లు రావడానికి కారణాలు ఏమిటో విశ్లేషిస్తున్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ గెలుపొందగా హుస్నాబాద్ సెగ్మెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు 66,885, కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌కు 44,123 ఓట్లు, బండి సంజయ్‌కి 43,144 ఓట్లు వచ్చాయి. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు 79,001, బండి సంజయ్‌కి 55,873, బోయినిపల్లి వినోద్‌కుమార్‌కు 41,298 ఓట్లు వచ్చాయి. గత ఎన్నికల కంటే బీఆర్ఎస్‌కు 25,587 ఓట్లు తగ్గాయి. బీజేపీకి 12,729 ఓట్లు పెరిగాయి. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గం కావడంతో ఇక్కడ కాంగ్రెస్‌కు 23,128 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఏదేమైనా మెజార్టీ ప్రజాప్రతినిధులు, పటిష్టమైన కార్యకర్తల బలం ఉండి ఓట్లు తగ్గడానికి కారణాలపై విశ్లేషిస్తున్నారు.

కంటైనర్ ఢీకొని కారు పల్టీ


కంటైనర్ లారీ ఢీకొనడంతో బోల్తా పడిన కారు

- హల్దీవాగు బ్రిడ్జిపై ప్రమాదం.. తప్పిన ప్రాణాప్రాయం

తూప్రాన్, జూన్ 6 : హల్దీవాగు బ్రిడ్జి మీదుగా వెళుతున్న కారును వెనుకగా వచ్చిన కంటైనర్ ఢీకొనడంతో కారు పల్టీ కొట్టిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులో గురువారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్‌కు చెందిన గోపి, తరుణ్, రాకేష్, చింటు, సాయి, ప్రణీత్ దైవ దర్శనార్థం యాదాద్రికి వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యారు. తూప్రాన్ పట్టణానికి చేరుకుని 44వ జాతీయ రహదారిపై వెళుతున్నారు. తూప్రాన్ పట్టణం దాటి హల్దీవాగుపై నిర్మించిన బ్రిడ్జి మీదుగా వెళుతుండగా కంటైనర్ లారీ వేగంగా వచ్చి కారును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సంఘటనతో కారు నాలుగు పల్టీ కొట్టి బ్రిడ్జి సైడ్ రేలింగ్ వరకు వెళ్లి నిలిచిపోయింది. తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. రేలింగ్ దాటితే హల్దీవాగు నీటిలో పడిపోయి భారీ ప్రమాదం జరిగి ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్వల్ప గాయాలతో ఆరుగురు బయట పడటంతో ఊపిరి పీల్చుకున్నారు. కంటైనర్ లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సిద్దిపేట క్రీడాకారుడికి కాంస్యం


తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ కార్యదర్శి సారంగపాణి నుంచి పతకం, సర్టిఫికెట్‌ను అందుకుంటున్న గాడిచర్ల జితేష్

సిద్దిపేట టౌన్, జూన్ 6 : హనుమకొండలో నిర్వహించిన పదో తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సిద్దిపేట క్రీడాకారుడు గాడిచర్ల జితేష్ కాంస్య పతకం సాధించారని అథ్లెటిక్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. గాడిచర్ల జితేష్ 300 మీటర్లను 48 సెకన్లలో పూర్తి చేశాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ కార్యదర్శి సారంగపాణి జితేష్‌కు కాంస్య పతకం, మెరిట్ సర్టిఫికెట్‌ను అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి వెంకటస్వామి, కోచ్ కల్లపల్లి కృష్ణ జితేష్‌ను అభినందించారు.



మెదక్ అర్బన్: మెదక్ జిల్లా జక్కన్నపేటలో బడిబాట అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలోని కల్వకుంటలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



శివ్వంపేటలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్

ఉత్సాహంగా బడిబాట కార్యక్రమం

ఉమ్మడి మెదక్ జిల్లాలో గురువారం బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజు మెదక్ జిల్లావ్యాప్తంగా 897 ప్రభుత్వ పాఠశాలల పరిధిలో సంబంధిత ఉపాధ్యాయులు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఉత్సాహంగా ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో రాధాకిషన్ మాట్లాడుతూ.. బడి బయట పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. అలాగే సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు.



వెల్దుర్తి మండలంలోని శేరి గ్రామంలో బడిబాట ర్యాలీ



కొల్చారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈవో రాధాకిషన్



తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో బడిబాటలో ప్రతిజ్ఞ



మనోహరాబాద్: కాళ్లకల్‌లో ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం



టేక్మాల్ బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కల్హేర్ మండల వ్యవసాయ అధికారిగా శ్రీనివాస్

కల్హేర్, జూన్ 6: కల్హేర్ మండల వ్యవసాయ అధికారిగా శ్రీనివాస్‌ను నియమిస్తూ జిల్లా వ్యవసాయాధికారి గురువారం ఉత్తర్వులు జారిచేశారు. కొన్నేళ్లుగా సిర్గాపూర్ మండల వ్యవసాయ అధికారి శశాంక్ కల్హేర్ మండల ఏవోగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని రైతు శిక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను డిప్యూటేషన్‌పై కల్హేర్ మండల ఏవోగా నియమించారు. సంగారెడ్డి జిల్లాలోనే అత్యధికంగా వరి పండించే కల్హేర్ మండలానికి వానాకాలం ముందు ఏవోను నియమించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

11న సదరం స్లాట్లు, 18న క్యాంపు

సంగారెడ్డి అర్బన్, జూన్ 6: దివ్యాంగులను గుర్తించే సదరం క్యాంపును ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్లాట్లు 11న కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. క్యాంపునకు హాజరయ్యే దివ్యాంగులు ఆధార్‌కార్డు, ఫొటో, సంబంధిత మెడికల్ రిపోర్ట్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నేడు ఖేడ్‌లో సురేష్‌షెట్కార్ విజయోత్సవ ర్యాలీ

నారాయణఖేడ్, జూన్ 6: జహీరాబాద్ ఎంపీగా గెలుపొందిన సురేష్‌షెట్కార్ విజయోత్సవ ర్యాలీని శుక్రవారం ఉదయం 11 గంటలకు ఖేడ్‌లో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు గురువారం తెలిపారు. విజయోత్సవ ర్యాలీ నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట దుర్గామాత ఆలయం నుంచి ప్రారంభమై రాజీవ్ చౌక్ మీదుగా శివాజీ చౌక్ వరకు కొనసాగుతుందన్నారు. ఈ ర్యాలీలో ఎంపీ సురేష్‌షెట్కార్‌తో పాటు ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొంటారని, నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

'ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లు కేటాయించాలి'

నర్సాపూర్, జూన్ 6: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లోని పేదల పిల్లలకు ఉచితంగా సీట్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం నర్సాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరం మొదలుకాకముందే ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల్లో అడ్మిషన్ల పేరుతో వ్యాపారం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలకు విద్య అందేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు ఇంటర్ బోర్డు కార్యాలయం ముట్టడి

సంగారెడ్డి రూరల్, జూన్ 6: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇంటర్ బోర్డు కార్యాలయాన్ని ముట్టడించనున్నామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కన్వీనర్ దత్తు రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలో గురువాం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు తమ ఇష్టానుసారంగా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు.

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

● మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

మనోహరాబాద్, జూన్ 6: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ ఆశావర్కర్లకు సూచించారు. గురువారం తూప్రాన్, మనోహరాబాద్ ఉమ్మడి మండలాల ఆశావర్కర్లు, ఏఎన్ఎంలతో మనోహరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కేంద్రం ప్రోగ్రాం అధికారి నవీన్‌కుమార్, మండల వైద్యాధికారి వికాస్‌తో కలిసి మాట్లాడారు. వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, అలాచేసిన వారిపై చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సూపరింటెండెంట్ అమీర్‌సింగ్, డీడీవో వికాస్, బాలనర్సయ్య, సీహెచ్‌వో వైష్ణవి, సాలుబై, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆశావర్కర్లతో మాట్లాడుతున్న మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు

నారాయణఖేడ్/మనూరు/చిలప్‌చెడ్/కొండాపూర్, జూన్ 6: నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ హెచ్చరించారు. గురువారం నారాయణఖేడ్ పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను వ్యవసాయాధికారులు శంకర్, శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో ఉన్న విత్తనాలు, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్, ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు, స్టాక్ బోర్డులు పరిశీలించడమే కాకుండా ఏయే కంపెనీల ద్వారా వస్తున్నాయనే విషయాలను పరిశీలించారు. అలాగే మండల కేంద్రమైన మనూరు, మాయికోడ్ రాణాపూర్ గ్రామాల్లో ఖరీఫ్ పంటల సాగును, విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో బాల్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని, ఫైజాబాద్‌లోని ఫాక్స్ ఎఫ్‌పీవోలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువుల స్టార్ రిజిస్టర్లను పరిశీలించారు. మండల కేంద్రమైన కొండాపూర్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను తహసీల్దార్ లావణ్య మండల వ్యవసాయ అధికారి గణేష్‌తో కలిసి తనిఖీ చేశారు.



ఖేడ్‌లో ఎరువులు, విత్తనాల దుకాణాల్లో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడి: సోమేశ్వర్‌రావు

కొండాపూర్, జూన్ 6: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక దిగుబడి పొందొచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వర్‌రావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని తెర్పోల్‌లో సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ సాగును పరిశీలించి మాట్లాడారు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికి 600ల ఎకరాలు సాగులోకి వచ్చాయని, అదనంగా మరో 700ల ఎకరాల సాగు మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ మండల అధికారి శైలజ, రైతులు గజేందర్‌రెడ్డి, రత్నం, కుమార్‌గౌడ్, నాగేశ్వర్‌రావు, సీతారందేశ్‌పాండే పాల్గొన్నారు.



తెర్పోల్‌లో సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న సోమేశ్వర్‌రావు

ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన విద్యాబోధన జరగాలి



కూచన్‌పల్లిలో పాఠశాల్లో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, జూన్ 6: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యాబోధన జరగాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కూచన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మరమ్మతు పనులను అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. అధికారులు పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. బడి మానేసిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ నారాయణ, ప్రధానోపాధ్యాయుడు మధుమోహన్ తదితరులు ఉన్నారు. అలాగే ఫరీద్‌పూర్ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిఫాం కుట్టు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.

ఎంపీలను కలిసిన నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 6: మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా గెలిచిన రఘునందన్‌రావును హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. రఘునందన్‌రావు మాట్లాడుతూ తన విజయం మెదక్ ప్రజలకు అంకితమని, మెదక్ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన బీజేపీ జిల్లా నాయకులు

సంగారెడ్డి రూరల్, జూన్ 6: లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ బీజేపీ ఎంపీగా భారీ విజయం సాధించిన బండి సంజయ్‌ని ఆ పార్టీ సంగారెడ్డి జిల్లా నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బండి సంజయ్‌ని కలిసిన వారిలో బీజేపీ జిల్లా నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, పోచారం రాములు, మందుల నాగరాజు ఉన్నారు.

ఎంపీని సన్మానించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 6: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన సురేష్‌షెట్కార్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తన సోదరుడు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితో గురువారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందించారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

● ఎన్‌పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య



మాట్లాడుతున్న ఎన్‌పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

నారాయణఖేడ్, జూన్ 6: దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎన్‌పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. గురువారం ఖేడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో సంఘం డివిజన్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 40 లక్షల మంది దివ్యాంగులు ఉంటే కేవలం 5.75 లక్షల మందికే పెన్షన్లు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈనెల 27న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి దివ్యాంగుల సాంస్కృతిక ఉత్సవాలను, జూలై 23, 24 తేదీల్లో నారాయణఖేడ్‌లో సంగారెడ్డి జిల్లా తృతీయ మహాసభలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్‌పాటిల్, ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కంకర క్రషర్ గుర్తింపును రద్దు చేయాలి

● మైనింగ్ ఏడీ ఎదుట హత్నూర గ్రామస్థుల ఆవేదన

హత్నూర, జూన్ 6: మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులో గల శ్రీ గణపతి కంకర క్రషర్ గుర్తింపును రద్దు చేయాలని హత్నూర గ్రామస్థులు గురువారం మైనింగ్ ఏడీ రఘుబాబును కోరారు. కంకర క్రషర్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు చేపట్టడంతో పాటు, పరిమితికి మించి తవ్వకాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండికొడుతున్నారని ఏడీ దృష్టికి తీసుకొచ్చారు. కంకర క్రషర్ యాజమాన్యం పరిమితికి మించి తవ్వకాలు చేస్తున్నందున విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని హత్నూర తహసీల్దార్ పర్వీన్ షేక్‌కు మైనింగ్ ఏడీ సూచించారు. ఈ కార్యక్రమంలో రామే రాములు, వెంకటేశంగౌడ్, ఉప్షగల్ల భూమయ్య, ఉప్షగళ్ల బాలకృష్ణ, అడ్వకేట్ శ్రీను, పొట్లగళ్ల శంకర్ పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో మరో ఐదేళ్లు సుస్థిర అభివృద్ధి

● రాష్ట్రంలో 8 ఎంపీ స్థానాలు కైవసం చేసుకోవడం పట్ల హర్షం

● సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూన్ 6: మోదీ నాయకత్వంలో దేశాన్ని మరో ఐదేళ్లు సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి చౌరస్తాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోదీ మూడోసారి ప్రధాని కావడానికి ఓటేసిన అందరికీ, అదేవిధంగా తెలంగాణాలో ఎనిమిది ఎంపీలను గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోదీ సారథ్యంలో మరో ఐదేళ్లు ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా దేశాన్ని అభివృద్ధి చేస్తారని ఆశిస్తున్నానన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, రాములు, నాగరాజు, ద్వారక రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

మెదక్ డిగ్రీ కళాశాలకు గ్రీన్ ఛాంపియన్ అవార్డు

మెదక్ అర్బన్, జూన్ 6: పర్యావరణ పరిరక్షణలో సుస్థిరమైన అభివృద్ధికి కృషిచేసిన వివిధ స్వచ్ఛంద, ప్రభుత్వ, విద్యాసంస్థలు, వ్యక్తులకు వివిధ విభాగాల్లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి గ్రీన్ ఛాంపియన్ అవార్డులను ప్రకటిస్తుంది. అందులో భాగంగా 2024 సంవత్సరానికి మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రీన్ ఛాంపియన్ అవార్డుకు ఎంపికైంది. కళాశాలలో వర్షపు నీటి నిలువ నిర్వహణ ఫలితంగా భూగర్భ జలాలను పెంచేందుకు చేసిన ప్రయత్నాలు, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, హరితహారంపై విద్యార్థులకు నిర్వహించిన వివిధ అవగాహన కార్యక్రమాలకుగానూ కళాశాల ఈ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డా. హుస్సేన్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్ చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపల్ డా. హుస్సేన్ అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న కళాశాల ప్రిన్సిపల్ డా.హుస్సేన్

కాలకృత్యాలకు వెళ్లి.. రైతు మృతి



శంకర్(ఫైల్)

కౌడిపల్లి, జూన్ 6: కాలకృత్యాలకు వెళ్లిన యువరైతు ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని ధర్మసాగర్ శివారులో చోటు చేసుకున్నది. మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన తాటి శంకర్(42) మండల కేంద్రమైన కౌడిపల్లికి సొంత పనుల నిమిత్తం వెళ్లాడు. పని అయిపోయాక తిరిగి వస్తుండగా.. ధర్మసాగర్ శివారులోని చెరువు సమీపంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి కిందపడ్డాడు. కాగా తూము వద్ద శంకర్ కిందపడి ఉన్నాడన్న విషయాన్ని స్థానికులు కుటుంబసభ్యులకు తెలియజేశారు. వారు వచ్చి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మాసాయిపేట, జూన్ 6: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మాసాయిపేట మండలం శ్రీనివాస్‌నగర్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకున్నది. కామారెడ్డి రైల్వే ఎస్ఐ నాయక్ వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి(35) రైల్వేస్టేషన్‌లోని ఫ్లాట్‌ఫామ్ వద్ద నిలబడగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. మృతదేహం ముక్కలు ముక్కలయ్యిందని, ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని చెప్పారు.

వీడిన సంగమేశ్వర్ అదృశ్యం మిస్టరీ

● గంగకత్వవాగులో మృతదేహం లభ్యం

మునిపల్లి, జూన్ 6: సంగమేశ్వర్ అదృశ్యం మిస్టరీని పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. సదాశివపేట మండలం గంగకత్వవాగులో సంగమేశ్వర్ గురువారం శవమై కనిపించాడు. కొండాపూర్ మండలం సైదాపూర్ గ్రామానికి చెందిన సంగమేశ్వర్(32) మండల పరిధిలోని కంకోల్ గ్రామ శివారులో గల వొక్సాన్ యూనివర్సిటీలో గార్డెన్ వర్కర్‌గా పనిచేస్తూ గత ఆదివారం అదృశ్యమైన విషయం అందరికీ తెలిసిందే. సంగమేశ్వర్‌ను చూపించాలంటూ యూనివర్సిటీ ఎదుట కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. సంగమేశ్వర్ అదృశ్యం కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టగా.. గంగకత్వవాగులో అతడి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని సదాశివపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే సంగమేశ్వర్ మృతిపై కుటుంబీకులు, బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంగమేశ్వర్ యూనివర్సిటీలోనే చనిపోయారా..? లేక ఎవరైనా హత్య చేశారా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డిన్నర్‌కు వెళ్లిన యువతి అదృశ్యం



రుక్సాన(ఫైల్)

టేక్మాల్, జూన్ 6: ఇంటి నుంచి డిన్నర్‌కు వెళ్తున్నానని చెప్పిన యువతి అదృశ్యమైంది. ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ రజియా, అబ్దుల్ హైమద్‌కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. రజియా కుమారులతో హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పని చేసుకుంటుంది. ఇద్దరు కూతుళ్లతో తండ్రి సూరంపల్లి గ్రామంలో ఉంటున్నాడు. ఈనెల 4న మహ్మద్ రుక్సాన(25) హైదరాబాద్‌లో బంధువుల డిన్నర్‌కు వెళ్తున్నానని చెప్పింది. అయితే 5న భార్య రజియాకు రుక్సాన హైదరాబాద్ వచ్చిందని అబ్దుల్ ఫోన్‌లో సమాచారం ఇవ్వగా.. ఇక్కడికి రాలేదని చెప్పింది. ఆందోళన చెందిన అబ్దుల్ బంధువుల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తూము షెట్టర్లు చోరీ

హత్నూర, జూన్ 6: హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామ శివారులో గల గుళ్లకుంట, కాటేవానికుంటల తూముల షెట్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. రెండేళ్ల క్రితం నీటిపారుదల శాఖ అధికారులు ఆ కుంటలకు నూతనంగా తూముల నిర్మాణం చేసి షెట్టర్లను ఏర్పాటు చేశారు. కాగా గురువారం వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లిన రైతులు తూములకు షెట్టర్లు కనిపించకపోవడంతో ఖంగుతిన్నారు. అధికారులు షెట్టర్లు దొంగిలించిన వారిపై చర్యలు తీసుకుని, నూతన షెట్టర్లు బిగించాలని రైతులు కోరారు.

చెరువును తలపిస్తున్న కాజీపల్లి శివారు ఔటర్ బ్రిడ్జి



బ్రిడ్జి కింద భారీగా నిలిచిన వర్షపు నీరు

జిన్నారం, జూన్ 6: ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షానికే ఔటర్ రహదారి బ్రిడ్జి కింద నీరు చేరి చెరువులా మారింది. జిన్నారం మండలం కాజీపల్లి వద్ద మల్లంపేట వైపు ఉన్న ఔటర్ రహదారి బ్రిడ్జి కింద భారీగా నీరు చేరింది. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మూడేళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు, ప్రయాణికులు మండిపడుతున్నారు. వెంటనే నీటిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

చెరువులో ఫెన్సింగ్‌ను తొలగించాలి



ఇరిగేషన్ ఈఈని కోరుతున్న చింతలగట్టు గ్రామస్థులు

కోహీర్, జూన్ 6: తమ గ్రామ పరిధిలో ఉన్న చెరువులో ఓ ప్రైవేట్ పరిశ్రమ వారు ఏర్పాటుచేసిన ఫెన్సింగ్‌ను తొలగించాలని కోహీర్ మండలం చింతలగట్టు గ్రామస్థులు గురువారం చెరువు వద్ద ఆందోళన నిర్వహించి, సంబంధిత అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామ పరిధిలో ఉన్న గుండం చెరువు నీటి పరీవాహక ప్రాంతం ఎఫ్‌టీఎల్ 20 ఎకరాల వరకు ఉంటుందన్నారు. ఎఫ్‌టీఎల్ ఉన్న ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు, ఫెన్సింగ్, అడ్డుకట్టలు వెయ్యకూడదన్న నిబంధన ఉన్నా మండలంలోని కవెల్లి గ్రామ పరిధిలోని రెవెన్యూ సర్వే నంబర్ 25/1లో భూమి గల కిర్బీ బిల్డింగ్ సిస్టమ్స్ స్ట్రక్చర్స్ ఇండియా గుజరాత్ లిమిటెడ్ పేరుపై ఉన్న భూమి గలవారు తమ గ్రామం వారికి, చుట్టుపక్కల పొలం ఉన్నవారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రైవేట్ వ్యక్తులతో సర్వే చేయించి తమ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారన్నారు. వెంటనే ఎఫ్‌టీఎల్ ఫెన్సింగ్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. చెరువులో ఎలాంటి నిర్మాణాలు, ఫెన్సింగ్ లేకుండా చూస్తామని సంబంధిత శాఖ అధికారులు తెలియజేయడంతో గ్రామస్థులు శాంతించారు.

కొనసాగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 6: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం తృతీయ భాష పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్, రామచంద్రాపురంలోని జడ్పీ హైస్కూల్, జహీరాబాద్‌లోని సిద్ధార్థ హైస్కూల్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 142 మందికి 102 మంది హాజరు కాగా, 40 మంది గైర్హాజరయ్యారు. 71.83 శాతం హాజరు నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా రామచంద్రాపురంలోని జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్స్ తనిఖీ చేశారు.

'గుంతల రహదారులకు మరమ్మతు చేయండి'

జిన్నారం, జూన్ 6: బొల్లారం మున్సిపాలిటీలో గుంతలమయంగా మారిన రహదారులకు వెంటనే మరమ్మతులు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో మిషన్ భగీరథ కోసం తీసిన గోతులు పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారినా మున్సిపల్ పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆనందకృష్ణారెడ్డి అన్నారు. ప్రధాన రహదారి సహా కాలనీల్లో భారీ గుంతలుపడ్డాయన్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జనసంద్రంగా బోరంచ నల్లపోచమ్మ ఆలయం

మనూరు, జూన్ 6: ఏడువారాల బోరంచ నల్లపోచమ్మ జాతరలో భాగంగా గురువారం నాలుగో వారం జాతర కొనసాగింది. అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం జనసంద్రంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.